సాక్షి నిజామాబాద్

బుధవారం । 13 । ఆగస్టు । 2025



అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశ మున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం గా ఉండాలని కలెక్టర్‌ పేర్కొన్నారు.

- 8లో ▸



రుణ మాఫీ కొందరికేనా!

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

34.9 /22.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్‌

‘ఉమ్మడి జిల్లాలో రూ.120 కోట్ల రుణాలిచ్చాం’



నాగిరెడ్డిపేట: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల రుణాలను అందించామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనరల్‌ మేనేజర్‌ అనుపమ తెలిపారు. సుమారు 98 వేల మంది రైతులు పంట రుణాలు, దీర్ఘ కాలిక రుణాలు పొందారన్నారు. మంగళవారం ఆమె నాగిరెడ్డిపేట సహకార కేంద్ర బ్యాంకును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కర్షక్‌మిత్ర ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 1,500 మంది రైతులకు రూ. 30 కోట్ల వరకు రుణాలు ఇచ్చామన్నారు. సుమారు రూ.480 కోట్ల వరకు గోల్డ్‌లోన్‌లు అందించామన్నారు. ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలను పొందాలని సూచించారు. ఆమె వెంట డీజీఎం సుమమాల, స్థానిక బ్యాంకు మేనేజర్‌ ఎల్లేశం ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మోపాల్‌: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎన్‌డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగర శివారులోని బోర్గాం(పి) సొసైటీ ఆవరణలో ఎన్‌డీసీసీబీ ద్వారా మంజూరైన కర్షక్‌ మిత్ర రుణాలను మంగళవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని ఆరుగురు రైతులకు రూ.53.60లక్షల కర్షక్‌ మిత్ర రుణాలు మంజూరైనట్లు వెల్లడించారు. తక్కువ వడ్డీతో అన్నదాతలకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌ చైర్మన్‌ జయకృష్ణారెడ్డి, బంటు గంగాదాస్‌, సడక్‌ శేఖర్‌రెడ్డి, సడక్‌ మహేందర్‌రెడ్డి, ఈగ సాయిరెడ్డి, కామర్స్‌ మోహన్‌, గాజుల సాయిబాబా, సీఈవో కృష్ణ, సిబ్బంది నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై పట్టు సాధించాలి

- జిల్లా జడ్జి జీవీఎన్‌ భరత లక్ష్మి



నిజామాబాద్‌ లీగల్‌: న్యాయవాద వృత్తిలో స్థిరపడేందుకు సివిల్‌, క్రిమినల్‌తోపాటు ఇతర చట్టాలపై పట్టు సాధించాలని జిల్లా జడ్జి జీవీఎన్‌ భరతలక్ష్మి పేర్కొన్నారు. నల్సా సహకారంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల ప్యానెల్‌ లాయర్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏఐ, చాట్‌ జీపీటీ రాజ్యమేలుతున్న తరుణంలో సైతం సబ్జెక్టుపై అవగాహన కలిగిన వారు విజయవంతమైన లాయర్లుగా అవతరిస్తారని అన్నారు. అనంతరం క్రిమినల్‌ న్యాయచట్టాలపై ప్రముఖ న్యాయవాది కృపాకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఉదయ భాస్కర్‌ రావు, రాజేందర్‌ రెడ్డి, రాజ్‌కుమార్‌ సుబేదార్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధనకు సమయమేది..?



ప్రభుత్వ పాఠశాలల్లోని గురువులపై బోధనేతర పనుల భారం రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు పాఠాలు చెబుతూ బిజీగా ఉండే ఉపాధ్యాయులు నేడు యాప్‌, ఆన్‌లైన్‌ పనులతో కుస్తీ పడుతున్నారు. ఫలితంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు.

- బోధనేతర పనులతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు
- యాప్‌, ఆన్‌లైన్‌ పనులే అధికం
- అల్పాహార, మధ్యాహ్న భోజన అమలు బాధ్యతా గురువులకే..
- అటకెక్కుతున్న పాఠ్యాంశాల బోధన

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనకు ఆన్‌లైన్‌ పనులు ప్రతిబంధకంగా మారాయి. బోధనేతర పనులన్నీ ఉపాధ్యాయులు చేయాల్సి ఉండడంతో పాఠాల బోధన క్లిష్టతరంగా మారింది. మరోవైపు రాష్ట్ర విద్యాశాఖతోపాటు జిల్లా, మండల స్థాయి అధికారులు అడిగే నివేదికలు పంపేందుకు సమయం కేటాయిస్తున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల వివరాలు స్కూల్‌ ఎడ్యుకేషన్‌ యాప్‌లో నమోదు చేయలేదని 13 మంది హెచ్‌ఎంలకు జిల్లా విద్యాశాఖ మెమోలు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయులు మరింత ఆందోళన చెందుతున్నారు.

సగం సమయం వీటికే..

ప్రతిరోజు పాఠశాలలో ప్రార్థన నుంచే ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌ పని మొదలవుతుంది. డీఎస్‌ఈ–ఎఫ్‌ఆర్‌ఎస్‌ (డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ ఫేషియల్‌ రికగ్నిషన్‌ సిస్టమ్‌) ద్వారా విద్యార్థుల హాజరును నమోదు చేస్తారు. దీనికి అరగంట నుంచి గంట వరకు కేటాయించాల్సి వస్తోంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో అల్పాహారం, మిగతా పాఠశాలల్లో రాగిజావ పెట్టేందుకు మరొక గంట సమయం పడుతుంది. మొదటి రెండు పీరియడ్లు గడిచిన తర్వాత మధ్యాహ్న భోజనానికి గంట సమయం కేటాయించాల్సి వస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో గతేడాది ప్రవేశపెట్టిన తొలిమెట్టు, ఈ ఏడాది నుంచి ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టిన ఉన్నతి కార్యక్రమాల నిర్వహణ, వాటి పరీక్షలకు పాఠ్యప్రణాళిక తయారీ, బోధన ఉపకరణాల ను సమకూర్చాల్సి ఉంటుంది. ఇవే కాకుండా ఎఫ్‌ఎల్‌ఎన్‌ (ఫౌండేషన్‌ లిటరసీ న్యూమరసీ), ఎల్‌ఐపీ (లెర్నింగ్‌ ఇంప్రూవ్‌మెంట్‌ ప్రోగ్రాం), విద్యార్థుల వివరాలను యూడైస్‌ ప్లస్‌లో నమోదు చేయడం, కంప్యూటర్ల నిర్వహణ తదితర కార్యక్రమాలు ఉంటాయి.

ఒత్తిడిలో ఉపాధ్యాయులు

బోధనేతర పనులతో ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యతలంటే జంకుతున్నారు. గతేడాది నవీపేట, రెంజల్‌, బోర్గాం(పి) పాఠశాలలకు చెందిన పలువురు ప్రధానోపాధ్యాయులపై సస్పెన్షన్‌ వేటు పడింది. ఒకవైపు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. మరోవైపు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఏజెన్సీల నిర్వాహకులు మెనూ పాటించలేని పరిస్థితి ఏర్పడుతోంది. మంచినీటి వసతి, సరైన వంట పాత్రలు లేక చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సందర్భాలున్నాయి. వీటన్నింటికీ ప్రధానోపాధ్యాయులే కారణంగా చూపుతూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి



మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నుంచి హెచ్‌ఎంలను తప్పించాలి. వాటిని ప్రత్యేక ఏజెన్సీలకు అప్పగించాలి. ఉన్నతి కార్యక్రమాన్ని సరళీకృతం చేసి బోధనకు ఎక్కువ సమయం కేటాయించేలా హెచ్‌ఎంలకు అవకాశం ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి. – రవీందర్‌ గౌడ్‌, పీఆర్టీయూ నాయకుడు

ఇబ్బంది లేకుండా పనిచేయాలి



టీచర్లు తమకు కేటాయించిన పనులను ఇబ్బంది లేకుండా చేయాలి. పాఠశాలలో మిగతా టీచర్ల సహాయం తీసుకోవాలి. సరైన ప్రణాళిక ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఆన్‌లైన్‌ పనులు కూడా ఎక్కువ సేపు ఉండవు. – అశోక్‌, డీఈవో

ట్రాఫిక్‌ నియంత్రణ చర్యలు బలోపేతం చేయాలి



మాక్లూర్‌ మండలం మానిక్‌బండార్‌ వద్ద బ్లాక్‌ స్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌, సీపీ

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య
- జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్‌–63పై ఉన్న 26 బ్లాక్‌ స్పాట్ల పరిశీలన
- రోడ్ల మరమ్మతులు, స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం

కమ్మర్‌పల్లి/ఆర్మూర్‌టౌన్‌/మాక్లూర్‌/ఖలీల్‌వాడి: ప్రజల ప్రాణాల రక్షణ కోసం ట్రాఫిక్‌ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దు కమ్మర్‌పల్లి నుంచి బోధన్‌ వరకు 77 కిలోమీటర్ల మేర ఉన్న ఎన్‌హెచ్‌–63ని మంగళవారం పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఎన్‌ఏసీ, పంచాయతీరాజ్‌, రవాణ, 108 సర్వీస్‌ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్ర శివారులోని పెట్రోల్‌ బంక్‌ వద్ద యాక్సిడెంట్‌ స్పాట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి మరమ్మతులు త్వరగా చేపట్టాలన్నారు. ఎన్‌హెచ్‌–63 పరిధిలో ఉన్న దుకాణాలు, ప్రకటనల బోర్డులు, విగ్రహాలను వెనక్కి జరిపించాలని సూచించారు. గ్రామాల్లో పాదచారులు రోడ్డు దాటేందుకు జీబ్రా క్రాసింగ్‌ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని చోట్ల జంక్షన్లు మూసి వేయడానికి బారికేడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మూలమలుపుల వద్ద రోడ్డు విశాలంగా కనపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిని కలిపే అన్ని రకాల రోడ్లకు స్పీడ్‌ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

హైవేకు సమీపంలోని గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వారి సూచనలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ అధికారులు డ్రైవర్లకు తగిన సలహాలు, సూ చనలు ఇవ్వాలన్నారు. వృద్ధాప్యం, రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నవారికి లాంగ్‌ రూట్‌ డ్యూటీలు వేయకుండా ఉండటమే మంచిదని సూచించారు. ఆర్మూ ర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని జాతీయ రహదారిపై పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదం ఘటన నమూనా దృశ్యాన్ని కలెక్టర్‌, సీపీ తిలకించి అభినందించారు. వారి వెంట ఎన్‌హెచ్‌ పెర్కిట్‌ ఈఈ మల్లారెడ్డి, మంచిర్యాల పీడీ అజయ్‌, డీటీవో ఉమా మహేశ్వర్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ సతీశ్‌, పంచాయతీ రాజ్‌ శాఖ సిబ్బంది రామకృష్ణ, ఏసీపీలు మస్తాన్‌ అలీ, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌, ఐఆర్‌ఏడీ మేనేజర్‌ శ్రీవర్ష, 108 సర్వీసెస్‌ ప్రతినిధి రామలింగేశ్వరరెడ్డి, ఆర్మూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, సీఐలు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

ఐఎంఏలో అలజడి

- రెండున్నర గంటలపాటు ప్రత్యేక సమావేశం

సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌ నాగారం: సీఎంసీ కళాశాల పేరిట డబ్బుల వసూళ్లు, అక్రమ నియామకాలపై ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ జిల్లా శాఖలో అలజడి మొదలైంది. ‘సాక్షి’లో మంగళవారం ప్రచురితమైన ‘ఆటంతా అజ్జదే’ శీర్షికన కథనం వాట్సాప్‌ గ్రూపుల్లో వైరల్‌ అయ్యింది. వైద్య వృత్తికే మచ్చ తెచ్చేలా వ్యవహరించిన ఐఎంఏ అధ్యక్షుడి తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సాక్షిలో వచ్చిన కథనంపై ఐఎంఏలో రెండు గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. అధ్యక్షుడు డాక్టర్‌ అజ్జ శ్రీనివాస్‌ చేసిన తప్పిదాలపై కొంతమంది వైద్యులు మండిపడినట్లు తెలిసింది. తప్పు చేసిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సీఎంసీ అంశంలో మరో ఇద్దరు వైద్యుల ప్రమే యం ఉందని ఐఎంఏలో చర్చకు వచ్చినట్లు తెలిసింది.

దొంగ ఓట్లతో అధికారంలోకి..

- ఎన్నికల కమిషన్‌ బీజేపీకి తొత్తుగా మారింది
- ఓట్ల గోల్‌మాల్‌ను రాహుల్‌గాంధీ బయటపెట్టారు
- డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి



ఓటరు జాబితాను దహనం చేస్తున్న మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, శేఖర్‌ గౌడ్‌ తదితరులు

నిజామాబాద్‌ సిటీ: ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకొని దొంగ ఓట్లతో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌ నుంచి ధర్నాచౌక్‌ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించారు. ధర్నాచౌక్‌ వద్ద ఓటరు జాబితాను దహనం చేశారు. అనంతరం మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్ల దొంగతనాన్ని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌ గాంధీ బహిరంగం చేయగానే ఎలక్షన్‌ కమిషన్‌ వెబ్‌సైట్‌ను మూసివేసిందన్నారు. నుడా చైర్మన్‌, నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కేశవేణు మాట్లాడుతూ దొంగ ఓట్ల వ్యవహారం బయటపెట్టిన రాహుల్‌గాంధీని బీజేపీ నేతలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంభూపాల్‌, బాడ్సీ శేఖర్‌గౌడ్‌, జీ వీ రామకృష్ణ, విపుల్‌ గౌడ్‌, వేణురాజ్‌, రత్నాకర్‌, న రేందర్‌ గౌడ్‌, లింగం, కెతావత్‌ యాదగిరి, సయ్యద్‌ ఖైసర్‌, ప్రమోద్‌, మధుసూదన్‌, బొబ్బిలి రామకృష్ణ, వినయ్‌, సంగెం సాయిలు, మహిళా కాంగ్రెస్‌ నాయకులు మఠం రేవతి, పోల ఉష, పుప్పాల విజయ, స్వప్న, మీనా, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌ సంపూర్ణంగా అమలు చేయాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి
- నందిపేటలో కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీలు



నందిపేట తహసీల్‌ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

నందిపేట్‌(ఆర్మూర్‌): పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థుల హాజరుకు ఫేషియల్‌ రికగ్నిషన్‌ సిస్టమ్‌(ఎఫ్‌ఆర్‌ఎస్‌)ను సంపూర్ణంగా అమలు చేయాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నందిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని హెచ్‌ఎం మంజులకు సూచించారు. అంతకుముందు పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్‌, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను పరిశీలించారు. గర్భిణులు స్థానికంగానే సుఖ ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ప్రవీణ్‌కు సూచించారు. హైరిస్క్‌ కేసులను సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులకు రిఫర్‌ చేయాలన్నారు. స్కానింగ్‌ సెంటర్లపై నిఘా ఉంచాలని, ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాక్సినేషన్‌, టీబీ ముక్త్‌భారత్‌ అభియాన్‌ అమలు, గ్రామాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఎరువుల గోదామును తనిఖీ చేశారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి రాంబాబు, గోడౌన్‌ నిర్వాహకుడు కార్తిక్‌ను ఆదేశించారు. పశువైద్యశాలను సందర్శించి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, కృత్రిమ గర్భధారణ తదితర సేవలపై పశువైద్యాధికారి నితీశ్‌ వర్మను అడిగి తెలుసుకున్నారు. ఫైర్‌ స్టేషన్‌ను సందర్శించి విపత్తులు, అతివృష్టి సంభవించినప్పుడు సత్వరమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని స్టేషన్‌ ఆఫీసర్‌ నర్సింగ్‌రావును ఆదేశించారు.

నర్సరీ మొక్కలపై సంతృప్తి

మండల కార్యాలయం ఆవరణలోని నర్సరీలో మొక్కలు ఆరోగ్యంగా ఉండడాన్ని చూసి కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతి గురించి ఆరా తీశారు. ఈ నెల 13న మార్కింగ్‌ మేళాలో లబ్ధిదారులందరూ మార్కింగ్‌ పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్‌ కార్యాలయాన్ని సందర్శించి భూభారతిపై సమీక్షించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా చూడాలని తహసీల్దార్‌ సతీశ్‌, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఆపరేషన్‌ సిందూర్‌తో ఉగ్రవాదులకు గుణపాఠం

- నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ
- జాతీయత, దేశభక్తి, ఐక్యత చాటిచెప్పేలా భారీ తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌, నాయకులు

సుభాష్‌నగర్‌: భారతదేశం వైపు కన్నెత్తి చూసే ఉగ్రవాదులకు ఆపరేషన్‌ సిందూర్‌తో గుణపాఠం చెప్పామని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీచౌక్‌ నుంచి తిలక్‌ గార్డెన్‌ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున చేసిన భారత్‌ మాతాకీ జై అనే నినాదాలతో ఇందూరు నగరం హోరెత్తింది. తిలక్‌ గార్డెన్‌ చౌరస్తాలో సామూహిక జాతీయ గీతలాపన కార్యక్రమంతో ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా ధన్‌పాల్‌ సూర్యనారాయణ మాట్లాడుతూ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, జాతీయత, దేశభక్తిని ప్రపంచదేశాలకు చాటిచెప్పేలా ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆపరేషన్‌ సిందూర్‌ వంటి చారిత్రాత్మక రక్షణ చర్యలతో భారత సైన్యం శౌర్యం, నాయకత్వం ఎంత దృఢంగా ఉందో ప్రపంచానికి చాటి చెప్పారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్‌ మాజీ ఫ్లోర్‌లీడర్‌ గోపిడి స్రవంతి రెడ్డి, హర్‌ ఘర్‌ తిరంగా కో కన్వీనర్‌ రాంచందర్‌, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు పంచరెడ్డి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



831 ఇళ్లకు ఒకేసారి ముగ్గు

- నేడు ఇందిరమ్మ ఇళ్ల ‘మార్కింగ్‌ మహామేళా’
- జిల్లా వ్యాప్తంగా పనుల ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏకకాలంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధ, గురు వారాల్లో మంచి రోజులు ఉండడంతో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్‌ మహామేళా చేపట్టనున్నారు.

మొదటి స్థానం కోసం..

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్‌ సంకల్పించారు. అందులో భాగంగా అధికారులతో సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు సరిగా లేనివారికి మెప్మా, డీఆర్డీవో సహకారంతో రుణాలు మంజూరు చేయిస్తున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా 831 ఇళ్లకు మార్కింగ్‌ చేయనుండగా, అధికంగా నిజామాబాద్‌ అర్బన్‌లో 133, ఆర్మూర్‌లో 47, మాక్లూర్‌లో 44, రెంజల్‌లో 41 ఇళ్లకు భూమిపూజ చేయనున్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు 17,301 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో 9,526 ఇళ్లు పురోగతిలో ఉన్నాయి. వీటిలో బేస్‌మెంట్‌ లెవల్‌లో 5,043, రూఫ్‌ లెవల్‌లో 796, స్లాబ్‌ పూర్తయిన 256 ఇళ్లు ఉన్నాయి.



మాక్లూర్‌ మండలం మదన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్‌ చేపడుతున్న అధికారులు(ఫైల్‌)

ఆ ఇళ్లపై కొనసాగుతున్న విచారణ

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గతంలో ఇళ్లు పొందిన, వాహనాలు కలిగిన 355 మంది లబ్ధిదారులను అధికారులు పక్కన పెట్టారు. కాగా, జాబితాలో కొందరు గతంలో ఇల్లు నిర్మించుకొని మధ్యలోనే నిలిపివేసిన వారు ఉన్నారు. వీరు కూడా ప్రస్తుతం లబ్ధిదారులేనని, వారికీ ఇళ్లు అందేలా చూడాలని మళ్లీ ఆదేశాలు అందాయి. దీంతో మండల పరిషత్‌ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతూ లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. మరో మూడు రోజుల్లో విచారణ పూర్తిచేసి అర్హులైన వారి జాబితాను ప్రకటించనున్నారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

రుణ మాఫీ కొందరికేనా!

మోర్తాడ్ మండలం సుంకెట్‌కు చెందిన రైతు అరెపల్లి గంగాప్రసాద్‌కు ఎస్‌బీఐలో రూ.50వేల రుణం ఉంది. అతని పేరిట రెండు ఖాతాలు ఉన్నాయని ఆన్‌లైన్‌లో చూపడంతో రుణమాఫీ సొమ్ము జమకాలేదు. వాస్తవానికి సదరు రైతుకు ఒక్కటే రుణ ఖాతా ఉంది. బ్యాంకర్ల తప్పిదం తోనే గంగాప్రసాద్ పేరిట రెండు ఖాతాలు ఉన్నాయి. దీంతో ఏ విడత ల్లోనూ గంగాప్రసాద్‌కు రుణమాఫీ వర్తించలేదు. బ్యాంకు ఖాతాను సరిచేసి రుణమాఫీ సొమ్మును జమ చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో అతనికి నిరాశే మిగిలింది.

సుంకెట్‌కు చెందిన మరో రైతు సాయిరాంకు వేల్పూర్ మండలం రామన్నపేట్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.2.45లక్షల రుణం ఉంది. మాఫీ సొమ్ము పరిమితి కంటే ఎక్కువ రుణం ఉండటంతో సాయిరాంకు మాఫీ వర్తించలేదు. తన బకాయిలో రూ.45వేలను చెల్లించడానికి సాయిరాం సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం నుంచి సరైన సమాచారం లేకపోవడంతో రుణమాఫీకి అర్హుడు కాలేకపోయాడు. ఇది ఒక్క గంగాప్రసాద్, సాయిరాంలకు ఎదురైన సమస్యే కాదు. రూ.2లక్షల వరకు పంట రుణం బకాయి ఉన్న అనేక మంది రైతులకు కలిగిన అసౌకర్యం.

- రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు మాఫీ చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ
- నాలుగు విడతల్లో కొంత మందికే చేశారని ఆరోపణలు



మోర్తాడ్(బాల్కొండ): తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన రైతులు అందరికీ రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఎన్నికల్లో అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. కానీ రెండేళ్ల దగ్గరపడుతున్నా రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రుణమాఫీ ఊసెత్తకపోవడంతో అర్హులైన అనేక మంది రైతుల ఆశలు ఆవిరి అవుతున్నాయి.

జిల్లాలో 97,696 మందికి..

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ అమలు చేయగా, జిల్లాలోని 97,696 మంది రైతులు లబ్ధిపొందారు. వారికి సుమారు రూ.755 కోట్లు, 29 లక్షల, 40వేలు మాఫీ సొమ్ము ఖాతాల్లో జమ చేశారు. అప్పట్లో ప్రభుత్వం జిల్లాకు సంబంధించి 1,00,612 మంది రైతులకు రూ.782.30 కోట్ల నిధులు రుణమాఫీ కోసం విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. 2,916 మంది రైతుల వివరాలు సరిగా లేకపోవడంతో రూ.27.01కోట్ల మాఫీ సొమ్ము తగ్గిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఒక కుటుంబానికి రూ.2లక్షల రుణం మాఫీ చేయాల్సి ఉంది. ఈ లెక్కన జిల్లాలో రుణ మాఫీకి అర్హులైన వారి సంఖ్య ఇంకో 50వేల వరకూ ఉంటుందని అంచనా. రుణమాఫీకి అవసరమైనన్ని నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తూతూ మంత్రంగానే రుణాలు మాఫీ అయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వంలోనూ నిరాశే...

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ రుణమాఫీపై అనేక మంది రైతులు ఆశలు వదులు కోవాల్సి వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో రుణమాఫీ లక్ష్యం రూ.1790 కోట్లు కాగా 2,91,188 మంది రైతులకు మాఫీ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. అప్పట్లోనూ నిధుల కేటాయింపు సరిగా జరగకపోవడంతో కేవలం 97,418 మంది రైతులకు రూ.490.72 కోట్లు మాత్రమే మాఫీ జరిగింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్హత ఉండి రుణమాఫీ పొందని రైతులకు మాఫీ ఫలాలు అందించాలని పలువురు కోరుతున్నారు.

మాట తప్పడం సరికాదు..



ప్రభుత్వం రుణమాఫీ విషయంలో మాట తప్పడం సరికాదు. నిధులను కేటాయించి రైతులను రుణ విముక్తులను చేయాలి. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా మాట తప్పితే విలువ ఏముంటుంది. రేవంత్‌రెడ్డి సర్కార్ రుణమాఫీపై స్పందించాలి.

– నల్ల రాజేశ్వర్, రైతు, తొర్తి

రైతులకు అండగా నిలవాలి..



రుణం మాఫీ అవుతుందనే ఆశతో ఎంతో మంది రైతులు సకాలంలో రుణాలను రెన్యూవల్ చేసుకోక బ్యాంకుల దృష్టిలో డిఫాల్టర్లుగా ఉండిపోయారు. రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసి సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలవాలి.

– మాదాం చిన్న నర్సయ్య, రైతు, తొర్తి

స్పష్టత రావాల్సి ఉంది

గతంలో రుణ మాఫీ అయిన రైతుల సమాచారం మాత్రమే వ్యవసాయ శాఖ వద్ద ఉంది. నిధుల విడుదల విషయంపై మాకు ఎలాంటి సమాచారం లేదు. రుణమాఫీపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

– గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి, నిజామాబాద్

క్లుప్తంగా

తాళ్ల రాంపూర్ వీడీసీ రద్దు



మోర్తాడ్(బాల్కొండ): కల్లు విక్రయాలపై నిషేధం విధించి, గీతా కార్మిక సంఘం సభ్యులకు ఆలయ ప్రవేశం లేదని హుకుం జారీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి తమ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ అంటూ ఏది ఉండదని కమిటీని రద్దు చేస్తున్నట్లు మంగళవారం సభ్యులుగా వ్యవహరించిన వారు ప్రకటించారు. సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో గ్రామస్తుల సమక్షంలో గ్రామాభివృద్ధి కమిటీ రద్దు అంశాన్ని వెల్లడించారు. దీంతో గడచిన పది నెలల నుంచి తాళ్లరాంపూర్‌లో నెలకొన్న వివాదానికి తెరపడినట్లు అయ్యింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల గ్రామంలో చైతన్య సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి, ఇతర న్యాయాధికారులు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ సమక్షంలో వీడీసీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆలయ ప్రవేశంపై ఆంక్షలు ఎప్పుడూ లేవని ఇదంతా ఒక కల్పితమని వీడీసీ సభ్యులు ప్రధానంగా వివరించారు. వీడీసీ రద్దు ప్రకటనతో గ్రామస్తులు ఐక్యంగా ఉంటారా లేదా అనే విషయం ముందు ముందు తేలనుందని చెప్పవచ్చు.

చదువుపైనే దృష్టిసారించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుపైనే దృష్టిసారించాలని తెలంగాణ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్ అన్నారు. ఆర్మూర్, మామిడిపల్లి, ఆలూర్‌లోని ప్రభుత్వ బడులను, పెర్కిట్‌లోని మహిళా ప్రాంగణాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరు కూడా బాల్య వివాహాలు చేసుకోకూడదని, చదువు మధ్యలో ఆపవద్దని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కుమార్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, ఎంఈవో రాజగంగారాం, ఎంఈవో నరేందర్, హెచ్‌ఎం వనజ, ప్రాంగణం మేనేజర్ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెయూలో ముగిసిన తీజ్ ఉత్సవాలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న తెయూ బంజారా విద్యార్థులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో 9 రోజులుగా నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. బంజారా ఆడబిడ్డలు 9 రోజులు ఉపవాసదీక్షలు పాటించి తీజ్ పై భోగ్ బండార్‌తోపాటు మూడు పూటలు నీళ్ల పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోధుమ మొలకల బుట్టలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా బంజారా విద్యార్థినులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతాబాయి, కాంట్రాక్టు అధ్యాపకులు కిరణ్‌రాథోడ్, గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీనురాథోడ్, ఎస్ఎస్ఎస్‌యూ అధ్యక్షులు సాగర్ నాయక్, బోధనేతర సిబ్బంది బికోజి, నరేష్, మహావీర్, పూజారి రమేష్ గిరి మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

నిజామాబాద్‌అర్బన్: రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి మంగళవారం సాయంత్రం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు కూడా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 08462–220183కు సమాచారం ఇవ్వాలన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా, అప్రమత్తంగా వ్యవహరించి, తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఒకరికి యావజ్జీవ కారాగార శిక్ష

నిజామాబాద్ లీగల్: ఆలయ పూజారిని హత్య చేసిన ఘటనలో ఒకరికి జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. వివరాలు ఇలా.. సారంగాపూర్ గ్రామానికి చెందిన దుబ్బాక లక్ష్మణ్, ఆర్మూరు మండలం పెర్కిట్ గ్రామానికి చెందిన దుబ్బాక ఎల్లయ్య ఇద్దరు కలిసి దొంగతనం చేయాలనుకున్నారు. 30 ఏప్రిల్ 2017లో మాక్లూర్ మండలం, చిన్నాపూర్ శివాలయంలో చోరీకి యత్నించారు. ఎటువంటి సొత్తు లభించకపోవడంతో ఆలయం పక్కనే ఉన్న గుడిసెలో పూజారి ఒక్కడే పడుకొని ఉండడంతో అతడి సంచిని ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. పూజారి వెంటనే మేల్కొని, వారిని అడ్డుకున్నాడు. ఈక్రమంలో దుండగులు అతడిని బండతో కొట్టి చంపి, అతడి వద్ద ఉన్న రూ.8,000 లను ఎత్తుకెళ్లారు. విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

కేసు విచారణలో ఉండగానే ఎల్లయ్య మృతి చెందాడు. లక్ష్మణ్‌పై నేరం రుజువు కావడంతో అతడికి నిజామాబాద్ రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు.

6.5 కిలోల గంజాయి స్వాధీనం



ఖలీల్‌వాడి: నగరానికి గంజాయి తీసుకు వస్తున్న ఒకరిని పోలీసులు పట్టుకొని, అతడి వద్ద నుంచి 6.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా.. నగరంలోని అమన్ నగర్, ఖిల్లా రోడ్డులో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకట్ తనిఖీలు చేపట్టారు. నగరానికి చెందిన షేక్ మిరాజ్ బైక్‌పై ఎండు గంజాయి తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిని విచారించగా మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన ఫారుఖ్ ఖురేషి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అతడి వద్ద ఉన్న 6.5 కిలోల గంజాయిని, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫారుఖ్ ఖురేషీ పరారీలో ఉన్నారని, మిరాజ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై నరసింహాచారి, సిబ్బంది నారాయణరెడ్డి, అవినాష్, విష్ణు, భోజన్న, శ్యామ్ తదితరులు ఉన్నారు.

జనగామలో కామారెడ్డి జిల్లావాసి మృతి



జనగామ: జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కామారెడ్డి జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. జనగామ ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని క్వార్టర్ హరిజనవాడకు చెందిన అనాథ నిమ్మల వెంకటేశ్(51) గత రెండు రోజులుగా జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రధాన గేటు సమీపంలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దయనీయ స్థితిలో ఉన్న అతడు ఆపన్న హస్తం కోసం అర్థించినా.. ఎవరూ కనికరించలేదు. ఈక్రమంలో వెంకటేశ్‌ను సాక్షి రిపోర్టర్ చూసి చలించి.. ముస్లిం యువ నాయకుడు సలీంతో కలిసి ఈనెల 11న ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి పోస్టుమార్టం ఫ్రీజర్‌లో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జనగామ పోలీసులను, లేదా 8712685259, 8712685260ను సంప్రదించాలన్నారు.

వాహనం బోల్తా .. ఏడుగురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: మండలంలోని చేపూర్ బైపాస్ వద్దగల 44వ నెంబర్ జాతీయ రహదారిపై టాటాఏస్ వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. టాటాఏస్ మిల్లర్ వాహనం మంగళవారం ఆర్మూర్ నుంచి బాల్కొండ వైపు బయలుదేరింది. చేపూర్ బైపాస్ వద్దగల 44వ నెంబర్ జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం?

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల కేజీబీవీలో వారం క్రితం ఓ ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. వివరాలు ఇలా.. జిల్లాకేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని కేజీబీవీలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతోంది. గత మంగళవారం అర్ధరాత్రి ఆమె కేజీబీవీ భవనం నుంచి కిందకు దూకింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై, కేకలు వేయడంతో కేజీబీవీ సిబ్బంది వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్రానికి, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై కేజీబీవీ ప్రత్యేకాధికారిణిని వివరణ కోరగా.. హాస్టల్ గది నుంచి విద్యార్థిని బయటకు రాగా కోతి దాడిచేయడంతో ఆమె గోడ దూకినట్లు వెల్లడించింది.

ఆత్మహత్యకు యత్నించిన యువతి.. కాపాడిన పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతిని కాపాడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. రెంజల్ మండలం వీరన్న గుట్ట గ్రామానికి చెందిన మౌనిక (21) మంగళవారం సాయంత్రం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. వెంటనే విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ హనుమాండ్లు, కానిస్టేబుల్ పండరి, షీటీమ్ ఇన్‌చార్జి వరలక్ష్మి యువతిని గమనించి, వివరాలు తెలుసుకున్నారు. ఇంట్లో సమస్యలు ఉన్నాయని, తనకు పెళ్లి చేయడం లేదని ఆమె వారికి వివరించింది. అనంతరం వారు ఆత్మహత్య చేసుకోవద్దని ఆమెకు కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఆమెను నగరంలోని సదరన్ హోం సూపరింటెండెంట్ జ్యోత్స్నకు అప్పగించినట్లు చెప్పారు.

బస్సు దిగుతుండగా కిందపడ్డ విద్యార్థి

- కాళ్ల మీదనుంచి బస్సు టైర్ వెళ్లడంతో గాయాలు



నిజాంసాగర్ (జుక్కల్): మండలకేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద ఓ విద్యార్థి బస్సు దిగుతుండగా కిందపడటంతో కాళ్లమీదనుంచి బస్సు టైర్ వెళ్లడంతో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్ మండలం గాలిపూర్ గ్రామానికి చెందిన కురుమ మహేష్ అచ్చంపేట మోడల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు అతడు నిజాంసాగర్ బస్టాండ్‌కు వచ్చాడు. ఈక్రమంలో పిట్లం వైపు వెళ్తున్న ఓ బస్సు ఎక్కాడు. కొద్దిసేపటికి బస్సు ఎల్లారెడ్డి వైపు వెళ్లదని తెలుసుకొని, బస్సు వెళుతుండగానే డోర్ నుంచి కిందకు దూకాడు. అతడు కిందపడిపోగా బస్సు టైర్ కాలు మీదనుంచి వెళ్లడంతో గాయపడ్డాడు. ప్రయాణికులు గమనించి వెంటనే కేకలు వేయడంతో బస్సును ఆపివేశారు. మహేష్‌ను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అటవీ భూమిని చదును చేసిన వ్యక్తి అరెస్ట్

కమ్మర్‌పల్లి: మండలంలోని అమీర్‌నగర్ శివారులోని అటవీ భూమిని చదును చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. అమీర్‌నగర్ శివారులోని అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తున్నారని అటవీశాఖ అధికారులకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. వెంటనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. అమీర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ జుబేర్ అనే వ్యక్తి అటవీ శాఖ సిబ్బంది నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశ్యంతో అటవీ శాఖ జీప్‌ను బ్లేడ్ బిగించిన ట్రాక్టర్‌తో అడ్డగించి పలుమార్లు ఢీకొట్టి పారిపోయాడు. బీట్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం అబ్దుల్ జుబేర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా.. దేవాయిపల్లి గ్రామానికి చెందిన తెడ్డుచిన్న బాలరాజు(46) సోమవారం రాత్రి కాలినడకన గ్రామం నుంచి కామారెడ్డి–ఎల్లారెడ్డి రోడ్డు మీదుగా తాడ్వాయి వైపు బయలుదేరాడు. ఈక్రమంలో కామారెడ్డి నుంచి తాడ్వాయి వైపు వస్తున్న గుర్తుతెలియని ద్విచక్ర వాహనం అతడిని వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలరాజుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రహణ శీల, మొర్రికి ఉచిత చికిత్సలు

- సర్వశిక్ష అభియాన్ సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- హైదరాబాద్‌లోని ఏవీఆర్ ఆస్పత్రిలో ఆపరేషన్లు
- జిల్లా వ్యాప్తంగా 62 మంది బాధితుల గుర్తింపు



గ్రహణ మొర్రి, గ్రహణ శీల చిన్నారులు (ఫైల్)


ఆర్మూర్: జిల్లావ్యాప్తంగా గ్రహణ మొర్రి, గ్రహణ శీలతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి సర్వశిక్ష అభియాన్ సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. రాష్ట్రస్థాయి అధికారుల సూచన మేరకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశానుసారం సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి, డీఈవో అశోక్, సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సమస్య తీవ్రతను బట్టి..

జిల్లా వ్యాప్తంగా ఐఈఆర్పీల సహకారంతో 0 నుంచి 18 సంవత్సరాల లోపు వయసులో గ్రహణ మొర్రి, గ్రహణ శీలతో బాధపడుతున్న సుమారు 62 మంది చిన్నారులను గుర్తించారు. వారిని శస్త్ర చికిత్సకు తరలించడానికి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

పిల్లల్లో సమస్య తీవ్రతను బట్టి గ్రహణ శీలతో బాధపడుతున్న వారికి రెండు నుంచి మూడు పర్యాయాలు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కొందరు పిల్లలకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అయినా సమస్య పరిష్కారం కాని వారిని సైతం తిరిగి శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించనున్నారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడలోని ఏవీఆర్ ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు పిల్లలను పరీక్షించి అవసరం ఉన్న వారికి ఉచితంగా శస్త్రచికిత్సను నిర్వహిస్తారు. అదే విధంగా ఈ శిబిరంలో గ్రహణ మొర్రి, గ్రహణ శీలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉన్న మూఢ నమ్మకాలను సైతం తొలగించడానికి అవగాహన సదస్సు సైతం నిర్వహించనున్నారు. గ్రహణ మొర్రి, గ్రహణ శీల శస్త్ర చికిత్సల అనంతరం పిల్లలకు వైద్యులు, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో స్పీచ్ థెరపీ సేవలను సైతం అందించనున్నారు. విద్యార్థులకు అన్ని మండల కేంద్రాల్లో ఉన్న భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాలలో శిక్షణనిచ్చి భాషణ లోపాలను సరిచేయనున్నారు. ప్రజలు మూఢనమ్మకాలను వీడి గ్రహణ శీల, మొర్రి బాధిత చిన్నారులకు చికిత్సలు చేయించాలని అధికారులు సూచిస్తున్నారు.


సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని బడి ఈడు పిల్లల్లో గ్రహణ మొర్రి, గ్రహణ శీలతో బాధ పడుతున్న వారిని ఐఈఆర్పీలు గుర్తించి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. మందులు, వసతి సైతం ఉచితంగా అందజేస్తారు. కాబట్టి బాధితులు మూఢ నమ్మకాలు వీడి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్, జిల్లా విద్యాధికారి, నిజామాబాద్

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలందించడంలో భాగంగా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గ్రహణ మొర్రి, గ్రహణ శీలతో బాధపడుతున్న పిల్లలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నాము. ప్రజలు మూఢనమ్మకాలను వీడి బాధిత చిన్నారులకు చికిత్సలు చేయించాలి.

– పడకంటి శ్రీనివాస్‌రావు, సహిత విద్యావిభాగం జిల్లా కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష, నిజామాబాద్

డొంకేశ్వర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఏఐ పాఠాలు

- మద్రాస్ ఐఐటీ నుంచి స్కూల్ కోడ్ కనెక్ట్ ప్రోగ్రాం అనుసంధానం
- పదో తరగతి విద్యార్థులకు రెండు నెలల పాటు బోధన



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐ పాఠాలు బోధించనున్నారు. ఇందుకోసం మద్రాస్ ఐఐటీ డొంకేశ్వర్ జెడ్పీ స్కూల్‌లో బోధనకు అంగీకారం తెలిపింది. ఈమేరకు మద్రాస్ నుంచి స్కూల్ కోడ్ కనెక్ట్ ప్రోగ్రాంను పాఠశాలకు అనుసంధానం చేసినట్లు హెచ్‌ఎం సురేశ్ కుమార్ వెల్లడించారు. ఇప్పటికే విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు కూడా ప్రారంభమైనట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బయోలాజికల్ ఇంజినీరింగ్ సిస్టమ్స్, ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ తదితర టెక్నాలజీలో బోధన చేయనున్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో ఈ సర్టిఫికెట్ కోర్సులు అందించనున్నారు. అక్టోబర్‌లో ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించి కోర్సు పత్రాలను అందజేస్తారు. ప్రస్తుతం డొంకేశ్వర్ పాఠశాల నుంచి 48మంది విద్యార్థులు ఈ కోర్సులకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పదో తరగతిలోనే విద్యార్థులు ఐఐటీ సాంకేతికతపై పట్టు సాధించేందుకు ఇది ఉపయోగపడుతుందని హెచ్‌ఎం అన్నారు. ఈ సందర్భంగా మద్రాస్ ఐఐటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్‌లో ఒకేషనల్ కోర్సు..

తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ విభాగంలో ఒకేషనల్ కోర్సు కూడా ప్రారంభమైనట్లు హెచ్‌ఎం తెలిపారు. తరగతి గదుల్లో బోధనలో భాగంగానే ఈ కోర్సును నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ప్రత్యేకంగా మైండ్ లీడర్స్ సంస్థ తరఫున ఒక టీచర్‌ను నియమించామన్నారు.

మృత్యువులోనూ కలిసే..

- కుంటలో పడి కవలల దుర్మరణం
- కామారెడ్డి మండలం తిమ్మక్‌ పల్లిలో ఘటన



కవలలు రామ్, లక్ష్మణ్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: కవలలుగా కలిసి జన్మించారు. మృత్యువులోనూ కలిసే లోకాన్ని వీడిపోయారు. పిల్లలే సర్వస్వంగా బతుకుతున్న ఆ తల్లిదండ్రులకు జరిగిన ఘటన కడుపుకోతను మిగిల్చింది. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా తిమ్మక్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుర్రాల పెద్ద నర్సింలు, మంజుల దంపతులకు రామ్, లక్ష్మణ్ (13) అనే కవలలు ఉన్నారు. స్థానికంగా ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుకుంటున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన వారిద్దరూ బ్యాగులు ఇంట్లో పెట్టి ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. రాత్రి 10 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెతకడం మొదలుపెట్టారు. సమీపం లోని కుంట కట్ట పైన పిల్లల బట్టలు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు, గ్రామస్తులు అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుని కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఒకరి మృత దేహం, మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో మరొక బాలుడి మృతదేహాలు లభ్యమయ్యాయి. సరదాగా గడిపేందుకు నీళ్ల లోకి దిగి లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక నీటమునిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతి చెందిన కవల పిల్లల తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపారు.

కుటుంబంలో తీరని విషాదం..

గ్రామానికి చెందిన పెద్ద నర్సింలు నిత్యం కామారెడ్డికి వచ్చి రోజువారీ మేస్త్రీ పనులు చేస్తూ, మంజుల బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు. 13 ఏళ్ల క్రితం నర్సింలు దంపతులకు కవలలు పుట్టారు. ఇద్దరు కుమారులు ఒకేసారి జన్మించడంతో తరువాత సంతానం వద్దనుకున్నారు. రామ్, లక్ష్మణ్ అనే పేర్లు పెట్టుకుని అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. పిల్లలే సర్వస్వంగా ఉన్నదాంట్లో సంతోషంగా బతుకుతున్నారు. ఉన్న ఇద్దరు పిల్లలు ప్రమాదవశాత్తు చనిపోవడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.